క్లుప్తంగా

రాజగోపుర నిర్మాణానికి విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి ఆదివారం భక్తులు విరాళం అందజేసి భక్తిని చాటుకున్నారు. బెంగళూరుకు చెందిన ఇల్లూరు వినయ్‌కుమార్, కుటుంబ సభ్యులు రూ.45 వేల విరాళాన్ని ఆలయ కార్యాలయంలో అందజేసినట్లు అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం దాతలచే స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, పూలమాల, స్వామి వారి శేషవస్త్రాలు, లడ్డూలు, బాండు, ఫొటోను అందజేశారు. ఆలయ సిబ్బంది మల్లికార్జున పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



వైష్ణవి

కౌతాళం: రాష్ట్రస్థాయి పోటీలకు హాల్వి జెడ్పీ పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సారథి తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వైష్ణవి పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 29 వరకు గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగే ఖోఖో పోటీల్లో విద్యార్థిని పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారిణి వైష్ణవిని ఉపాధ్యాయుల బృందం ఘనంగా సన్మానించారు.

సమస్యలపై విచారణ



తెలికాం నగర్‌లో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కౌన్సిలర్ సురేష్

ఆదోనిటౌన్: పట్టణంలోని 2వ వార్డు బావాజీపేట టెలికాంనగర్‌లో వార్డు కౌన్సిలర్ సురేష్ ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఓటరు జాబితాపై ఇంటింటికీ తిరుగుతూ విచారణ చేశారు.

నేటి నుంచి భగవద్గీత శిక్షణ

ఆదోనిఅర్బన్: స్థానిక అవ్వ బ్యాంకు పక్కన ఉన్న భగవాన్ శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ ఎడ్యుకేషన్ సొసైటీలో సోమవారం నుంచి ప్రతిరోజూ సాయంత్రం 6:30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సంపూర్ణ భగవద్గీత శిక్షణ ఇస్తున్నట్లు సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాచోటి రామయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పండితుడు శ్రీ సదాశివపాణి శిక్షణ ఇస్తారని చెప్పారు. ఆసక్తి, నేర్చుకోవాలనుకునే వారికి వయోపరిమితి, జాతివర్గ లింగబేధం లేదని తెలిపారు. అందరూ అర్హులేనని, ప్రతిఒక్కరూ నేర్చుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా గ్యారతారిఖ్ వేడుకలు




స్వామి వారి సమాధి వద్ద ప్రార్థన చేస్తున్న ధర్మకర్త

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ఆదివారం గ్యారతారిఖ్ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి ప్రార్థనలు చేశారు. దర్గా పరిసర ప్రాంతాల్లో భక్తులతో సందడి నెలకొంది. ఆదివారం సెలవు రోజు కలిసి రావడంతో దర్గాకు భక్తులు అధికంగా వచ్చారు. అంతకు ముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నాపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్ బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలు చేపట్టారు.

కాపు, బలిజల వనభోజన మహోత్సవం

ఆదోనిటౌన్: కాపు, తెలగ, బలిజ కులస్తులు విద్య, వైద్య రాజకీయ రంగాల్లో రాణించాలని కాపు బలిజ సంఘం గౌరవాధ్యక్షులు, అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మన్న, రంగస్వామి, చందం మల్లికార్జున, కాపునాడు జిల్లా అధ్యక్షుడు పత్తె భీమలింగప్ప అన్నారు. ఆదివారం ఆస్పరి రోడ్డులో వెలసిన లక్ష్మి నరసింహ స్వామి దేవాలయంలో కాపు, బలిజల కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి నరసింహస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ కాపు, బలిజలు ఒకే తాటిపై ఉంటూ సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అలాగే కల్యాణ మండపం నిర్మాణం త్వరలో పూర్తి చేద్దామని చెప్పారు. సంఘం జిల్లా జనరల్ సెక్రటరీ అభిమన్యు, ఆర్‌పీ గోపాలకృష్ణ, సున్నంబట్టి లక్ష్మన్న, బండి శ్రీనివాసులు, అడ్వకేట్ నాగేంద్రయ్య, పవన్ పాల్గొన్నారు.

డిజిటల్ బోధనతో విద్యా విప్లవం



ఐఎఫ్‌పీ ద్వారా విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన విద్యా సంస్కరణల ద్వారా విద్యార్థుల విద్యా సామర్థ్యాలు మెరుగు పడుతున్నాయి. డిజిటల్ విద్యా బోధన విద్యారంగంలో నూతన విప్లవానికి నాంది పలికింది. ఆదోని మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 55 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఇంగ్లిష్ మీడియం బోధనను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అన్ని స్థాయిలోని పాఠ్య పుస్తకాలను పీడీఎఫ్ రూపంలో ఆన్‌లైన్‌లో ఉంచడంతో పాటు బైజూస్ కంటెంట్‌తో 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లను పంపిణీ చేసింది. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్ల (ఐఎఫ్‌పీ) ద్వారా డిజిటల్ విద్య, ప్రాథమిక స్థాయి విద్యార్థులకు స్మార్ట్ టీవీలతో విద్యాబోధన అందిస్తున్నారు. తెలుగు మీడియం నుంచి వచ్చిన పిల్లలకు అర్థమయ్యే రీతిలో బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాలను ముద్రించి అందజేశారు. ప్రతి తరగతికి సబ్జెక్టు ఉపాధ్యాయుడు తప్పనిసరిగా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసున్నారు. దీంతో ప్రతి పాఠశాలలో సబ్జెక్టు ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆరోగ్య సంరక్షణ బాధ్యతలు

విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. పాఠశాలల్లో మధ్యాహ్నం జగనన్న గోరు ముద్ద పథకం ద్వారా పోషకాహారం, రాగిజావ, చిక్కి, వారానికి ఐదు రోజులు కోడి గుడ్లు ఇస్తున్నారు. నీటి సదుపాయాలతో కూడిన టాయిలెట్స్ వంటి సౌకర్యాలను కల్పించారు. బాలికలకు శానిటరీ న్యాప్‌కిన్స్ పంపిణీతో పాటు ఆరోగ్య పరిస్థితులపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి నెలా పాఠశాలలోనే వైద్య పరీక్షలు నిర్వహించి రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులకు ఐరన్ మాత్రలను అందజేస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం కలగకుండా పిల్లల చదువులను రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతగా తీసుకొని పుస్తకాల నుంచి యూనిఫాం వరకు అన్ని సమకూరుస్తోంది. తల్లిదండ్రులు చెల్లించాల్సిన ఫీజులు మిగలడం, పాఠశాలల్లో మెరుగైన బోధన లభిస్తుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

“అన్ని వసతులు సమకూర్చారు



నేను తొమ్మిదవ తరగతి చదువుతున్నాను. పాఠశాలలో నీటి వసతి నుంచి టాయిలెట్స్ వంటి అన్ని సౌకర్యాలను కల్పించారు. పోషకాహారంతో పాటు చిక్కీ, రాగి జావ, కోడిగుడ్లు అందిస్తున్నారు. పుస్తకాలు, దుస్తులు వంటివి అందించడమే గాకుండా ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తున్నారు. గతంలో ఈ సౌకర్యాలు ఏమీ లేవు. ప్రైవేట్ పాఠశాలలో మాదిరిగా డిజిటల్ విద్యను అందిస్తున్నారు. సబ్జెక్టు పుస్తకాలు కూడా అర్థమయ్యే విదంగా ఒకవైపు ఇంగ్లిష్, మరోవైపు తెలుగులో అచ్చు వేయించడం వల్ల సులభతరంగా ఉన్నాయి. చదువుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు సమకూర్చారు.

– పి.రేఖ, విద్యార్థిని, ఆర్‌ఆర్ లేబర్ కాలనీ పురపాలక పాఠశాల

డిజిటల్ విద్యను అందిస్తున్నారు



నేను పదో తరగతి చదువుతున్నాను. పాఠశాలలో ప్రతి సబ్జెక్టుకు ఉపాధ్యాయులను నియమించారు. గతంలో ఉపాధ్యాయులు సరిగా లేక చాలా ఇబ్బందులు పడ్డాం. పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు ఉండడం చాలా సంతోషంగా ఉంది. ఎదైనా ఒక పాఠం అర్థం కాకపోతే దానికి సంబంధించి పీడీఎఫ్ ఫైల్ ద్వారా మరోసారి ఐఎఫ్‌పీ ద్వారా చూసి నేర్చుకునే వెసులుబాటు కల్పించారు. డిజిటల్‌లో విన్న పాఠాలు అర్థం కాకపోతే బోర్డు మీద మాన్యువల్‌గా అర్థమయ్యే రీతిలో రాసి చూపిస్తున్నారు. పాఠశాలలో అన్ని వసతులు సమకూర్చినందుకు సంతోషంగా ఉంది.

– కే.అన్నపూర్ణ, విద్యార్థిని ఆర్‌ఆర్ లేబర్ కాలనీ పురపాలక పాఠశాల

“సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించారు



పాఠశాలలో ప్రతి సబ్జెక్టుకు ఉపాధ్యాయులను నియమించారు. గతేడాది 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 800 మంది విద్యార్థులు ఉంటే నలుగురు ఉపాధ్యాయులు ఉండేవారు. ప్రభుత్వం నాడు–నేడు ద్వారా పాఠశాల రూపురేఖలను మార్చడంతో పాటు 13 మంది ఉపాధ్యాయులను నియమించింది. ప్రస్తుతం పాఠశాలలో 910 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు పోషకాహారంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని ఐఎఫ్‌పీ ప్యానెళ్లను ప్రభుత్వం అందించింది. వాటి ద్వారా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన అందిస్తున్నాం. – రమేష్‌నాయుడు, ప్రధానోపాధ్యాయుడు, ఆర్‌ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాల

ఎన్‌సీసీ విద్యార్థుల ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్ట్స్ కళాశాల చైర్మన్ విట్టా సతీష్, ప్రిన్సిపాల్ మురళీమోహన్

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోఎన్‌సీసీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ 76వ దినోత్సవం పురస్కరించుకొని చేపట్టిన ఈ ర్యాలీని ఆర్ట్స్ కళాశాల చైర్మన్ విట్టా సతీష్, కరెస్పాండెంట్ దైవాదీనం రెడ్డి, ప్రిన్సిపాల్ మురళీమోహన్ జెండా ఊపి ప్రారంభించారు. ఆదోని ఆర్ట్స్ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణం పురవీధుల గుండా సాగుతూ శ్రీనివాస భవన్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారి గోవిందు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, సేవాభావం కలిగి ఉండాలన్నారు. పరిస్థితులకు అనుగుణంగా చిన్నతనం నుంచే వాటిని అనుసరించాల్సి అవసరం ఉందని తెలిపారు. ఆయా పాఠశాలలకు చెందిన ఎన్‌సీసీ అధికారులు పరిమళ, సుధాకర్ బాబు, రమేష్‌నాయుడు, నాగరత్న పాల్గొన్నారు.

28న హిందూ ధర్మ సమ్మేళనం

ఆలూరు: స్థానిక కోటవీధిలో కొలువుదీరిన శ్రీ భీమ లింగేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో ఈనెల 28వ తేదీన సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ ధర్మ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ప్రచార కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ పండితులు రవిశాస్త్రి, జే.హొస్సళ్లి పురవర్గ మఠం పీఠాధిపతి శంభులింగ శివచార్యులు, మల్లికార్జున స్వామి, గవిసిద్ధయ్య స్వామి, పెద్దహోతూరు గ్రామ ఉచ్చీరప్పతాత మఠం చంద్రమౌళీ స్వామి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

రాజ్యాంగ స్ఫూర్తితో దేశాభివృద్ధి





మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

ఆదోనిటౌన్: రాజ్యాంగం స్ఫూర్తితోనే దేశం పురోగతి చెందుతోందని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆదోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమం ఘనంగా జరుపుకున్నారు. అదేవిధంగా మున్సిపల్ కార్యాలయంలోనూ నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు దేవా, చైర్‌పర్సన్ బోయ శాంత మాట్లాడారు. స్వాతంత్ర్యం అనంతరం భారతదేశం రూపురేఖలను మార్చిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నేడు దేశం అన్ని రంగాల్లో రాణిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రాజ్యాంగంపై వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. మహిళా విభాగం జిల్లా కార్యదర్శి జిలేకాబీ, మున్సిపల్ మాజీ చైర్మన్ దేవదాసు, మహిళా నాయకురాళ్లు శోభలత, లక్ష్మి, లక్ష్మినారాయణ, గోపాల్, వీరాంజనేయులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా న్యాయ దినోత్సవం

ఆదోనిరూరల్: ఆదోని మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నేషనల్ లా డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ అంజినప్ప మాట్లాడుతూ నేటి ప్రభుత్వాలు అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని కోరారు. న్యాయవాదులు వీరేష్, అంజనప్ప, రవిస్వామి, లోకేష్, ప్రభాకర్, విశ్వనాథ్, సాయికుమార్, సల్మాన్, మస్తాన్, మధు, ఖలందర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాలకు సమన్యాయం



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

ఆదోని సెంట్రల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతికి సహకారం అందిస్తోందని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని జిహ్వేశ్వర విద్యాలయం ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంది తప్ప వారి అభివృద్ధికి ఏనాడూ కృషి చేయలేదని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కులమతాలకు అతీతంగా సామాజిక న్యాయం చేస్తూ అన్ని వర్గాల వారికి అండగా నిలుస్తోందన్నారు. అదేబాటలో ఆదోని నియోజకవర్గంలో మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని ముస్లింలకు కేటాయించినట్లు తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ఎంతగానో తోడ్పాటునందిస్తున్నట్లు చెప్పారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన భవగద్గీత పారాయణం, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మార్కెట్ యార్డు చైర్మన్ నజీర్ అహ్మద్, పురపాలక చైర్మన్ బి.శాంతి, వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై రంగనాథుడి ఊరేగింపు



మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన రంగనాథస్వామి వారిని ఆదివారం కార్తీక పౌర్ణమి సందర్భంగా సతీసమేతంగా గరుడ వాహనంపై కొలువుంచి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో జ్వాలాతోరణం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని జ్వాలా తోరణాలతో స్వాగతం పలికారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, కమిటీ సభ్యులు లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

ఆదోని అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న సినీ నిర్మాత టీజీ విశ్వప్రసాద్

ఆదోనిఅర్బన్: ఆదోనిలోనే పుట్టి పెరిగి ఉద్యోగ వృత్తి అమెరికాలో స్థిరపడి, ప్రస్తుతం సినీ నిర్మాతగా రాణిస్తూ ఎందరికో ఉపాధి కల్పిస్తున్నానని టి.జి.విశ్వప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మిగనూరు రోడ్డులోని వాసవీ కన్వెన్షన్ సెంటర్‌లో ఆర్య వైశ్య యువజన సంఘం అధ్యక్షుడు విట్టా అశ్విన్ ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజన మహోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సినీ నిర్మాత టీజీ విశ్వప్రసాద్ పాల్గొన్నారు. ముందుగా ఆయన ఎమ్మిగనూరు రోడ్డులోని 41 అడుగుల ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వనభోజన మహోత్సవంలో పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదోనిలో పుట్టి పెరిగిన తాను ఆదోనిని ఎన్నటికీ మరిచిపోనన్నారు. నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని తెలిపారు. ఆర్య వైశ్య రాష్ట్ర మహాసభ ఉపాధ్యక్షుడు విట్టా రమేష్ మాట్లాడారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో యువతీ, యువకులు అలరించారు. జిల్లా, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బద్రీనాథ్, ప్రకాష్, సభ్యులు వైభవ్‌స్నేహిత్, విజయ్, అనిల్, సురేంద్ర, రాజేష్, కులపెద్దలు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రానికి భవిష్యత్తు



మేళిగనూరులో ప్రభుత్వం పథకాలపై ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సంక్షేమ పథకాలపై ప్రచారం చేస్తున్న నాయకులు

కౌతాళం: వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి ఇంటికీ నవరత్నాల పథకాలు అందాయని పొదలకుంట ఎంపీటీసీ మూకన్న, నదిచాగి గ్రామ ఇన్‌చార్జ్ రామన్నగౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పొదలకుంట గ్రామంలో ‘వై ఏపీ నీడ్స్ జగన్’ కార్యక్రమం నిర్వహించారు. నదిచాగి మజారా గ్రామం మేళిగనూరులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల వల్ల ఎంత మంది లబ్ధిపొందారో తెలుపుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. అలాగే కౌతాళం ఎన్టీఆర్ నగర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. నాయకులు రామయ్య, నగేష్, మంజునాథ్, ప్రేమలత, కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: పేద బడుగు బలహీన వర్గాలకు ప్రస్తుతం మంజూరవుతున్న సంక్షేమ పథకాలు, రాష్ట్రాభివృద్ధి కొనసాగాలంటే ఏపీకి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని కొల్మాన్‌పేట సర్పంచ్ జయరాం పేర్కొన్నారు. ఆదివారం కోసిగి, కొల్మాన్‌పేట, అగసనూరు, ఆర్లబండ గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ‘వై ఏపీ నీడ్స్ జగన్’ కార్యక్రమం చేపట్టారు. ఆయా సచివాలయాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి గత టీడీపీ పరిపాలన తీరు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పరిపాలన తీరును ప్రజలకు వివరించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

పశుగ్రాసం తరలిస్తూ మృత్యువాత

నందవరం: మండల పరిధిలోని ముగతి గ్రామ సమీపంలో కురవ బుడ్డప్ప (34) అనే రైతు పశుగ్రాసం తరలిస్తూ గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మంత్రాలయం మండలం సూగూరు గ్రామానికి చెందిన కురువ బుడ్డప్ప పశుగ్రాసం కోసం ఎమ్మిగనూరుకు వెళ్లాడు. పశుగ్రాసం (వరి గడ్డి) ట్రాక్టర్‌పై తీసుకొస్తుండగా ముగతి గ్రామ సమీపంలో గుండెపోటుకు గురయ్యాడు. ట్రాక్టర్ నడుపుతుండగా నొప్పి రావడంతో వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపివేశాడు. నిమిషాల వ్యవధిలోనే కుప్పకూలిపోయి మృత్యువాత పడ్డాడు. స్థానికులు వెంటనే ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. మృతుడు బుడ్డప్పకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



మంత్రాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆదోనిలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ఆదోని సెంట్రల్: ఆదోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గోవిందరాజులు అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ సంజన్న మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం గొప్పతనాన్ని వివరించారు. ఆయా వ్యవస్థలు విధులు, అధికారాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ మురళీమోహన్, ఎస్టీయూ భవనంలో ఎస్టీయూ మండలాధ్యక్షుడు సుధాకర్‌బాబు అధ్యక్షతన రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం గొప్పతనాన్ని వివరించారు.

మంత్రాలయం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బీమా రెడ్డి, పార్టీ మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి పేర్కొన్నారు. వారు ఆదివారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి, స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అందరికీ సమాన హక్కులు, అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాజ్యాంగాన్ని రచించారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గోరుకల్లు కృష్ణస్వామి, రాజు, అబ్రహం, దేవదాసు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కౌతాళంలోని పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పాల్‌దినకర్ అధ్యక్షతన, పెద్దకడబూరులోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఫోరం ఫర్ ఆర్‌టీఐ జిల్లా కార్యదర్శి బొగ్గుల తిక్కన్న ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు.

వరద కాలువను నిర్మించండి



మాట్లాడుతున్న మల్లయ్య

కౌతాళం: రైతులు వలస పోకుండా తుంగభద్ర నదిపై వరద కాలువ నిర్మాణం చేపట్టాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య కోరారు. మండలంలో అతివృష్టి, అనావృష్టి వల్ల రైతులు కరవు కాటకాలకు గురవుతూ ఏటా నష్టాల పాలవుతున్నారన్నారు. దీంతో అప్పుల్లో కురుకుపోయి వలసలు వెళుతున్నారని దీనికి శాశ్వత పరిష్కారంగా తుంగభద్ర నదిపై వరద కాలువ నిర్మించి మండలంలోని పేద రైతులందరినీ ఆదుకోవాలని కోరారు. అలాగే రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29న ఎంపీడీఓ కార్యాలయంలో రైతు సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని మేధావులు, విద్యావేత్తలు, రైతులు, రాజకీయ నాయకులు పాల్గొని సలహాలు, సూచనలు ఇచ్చి వరద కాలువ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు.

వీధివిధినా సీసీ రోడ్లు



జంపాపురంలో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న సర్పంచ్ హారోన్



సజ్జలగుడ్డంలో రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం



కోసిగిలో ముస్లిం మైనార్టీ కాలనీలో వేసిన రోడ్డు

కోసిగి: మండలంలోని వివిధ గ్రామాల్లో డ్రయినేజీ, సీసీ రోడ్లకు మహర్దశ కలిగింది. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి సమక్షంలో గడప గడపకు మన ప్రభుత్వం, జాతీయ గ్రామీణ హామీ పథకం కింద కేటాయించిన నిధులలో ముమ్మరంగా డ్రయినేజీ, సీసీ రోడ్ల పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం కోసిగి గాంధీనగర్ వీధిలోని ముస్లిం మైనార్టీ కాలనీకి వెళ్లేందుకు ఉపాధి హామీ పథకం కింద రూ.17.50 లక్షలతో, సజ్జలగుడ్డం, జంపాపురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం నిధుల కింద ఒక్కొక్క గ్రామంలో రూ.20 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక గడప గడపకు మన ప్రభుత్వం కింద సచివాలయానికి రూ.40 లక్షలు చొప్పున అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. వీటితో సచివాలయ పరిధిలో తాగునీరు, డ్రయినేజీ, సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాలు తదితర పనులకు గ్రామ ప్రజల అభిప్రాయం మేరకు ఎమ్మెల్యే పనులు చేపట్టేందుకు అనుమతులు ఇచ్చారు. దీంతో పాటు, ఎమ్మెల్యే నిధులు, ఉపాధి హామీ పథకం నిధుల తో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో ముమ్మరంగా అభివృద్ధి పనులు జరుగుతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జ్వాలాతోరణ దర్శనం సర్వ పాపహరణం



బిణిగేరిలో జ్వాలా తోరణం వెలిగిస్తున్న భక్తులు

ఆస్పరి: మండలంలోని బిణిగేరి సమీపంలోని కొండల్లో వెలసిన శ్రీగిరి పంచలింగేశ్వర స్వామి క్షేత్రంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం రాత్రి జ్వాలాతోరణం, దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులు స్వామి ఆధ్వర్యంలో పంచలింగేశ్వర స్వామికి అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహా మంగళహారతి చేపట్టారు. ఆలయ ఆవరణలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య జ్వాలా తోరణంను వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు గుమ్మనూరు ఈశ్వర్, మహి తదితరులు వెలిగించారు. జ్వాలా తోరణం దర్శణంతో సర్వపాపాలు హరించబడి, కుటుంబం సుఖసంతోషాలతో ఉంటుందని ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులు స్వామి తెలిపారు. స్వామి వారి పల్లకీని ఊరేగించారు. ఆలయం ఆవరణలో భక్తులు దీపాలు వెలగించారు. మండలంలోని ఆస్పరి, చిగిళి, నగరూరు, చిరుమాన్‌దొడ్డి, శంకరబండ, తంగరడోణ, ఆదోని తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన, సీఈఓ ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.